

మెదక్ చర్చిలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## శాంతికి ప్రతీక మెదక్ చర్చి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మెదక్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : శాంతికి ప్రతీక మెదక్ చర్చి అని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పేర్కొన్నారు. మెదక్ చర్చి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు, గవర్నర్ కార్యదర్శి దాన కిషోర్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నగేశ్, ప్రెస్ బ్రీటర్ ఇన్‌చార్జి శాంతయ్య పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్, బీజేపీ నాయకులు

### గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే జాజాల



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 22: కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం వాడి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు 50 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం ఎల్లారెడ్డిలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో వీరు బీఆర్ఎస్‌లో చేరగా.. గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాజాల మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోతుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని తెలిపారు.

## సింగరేణి సీఎండీ డిప్యూటేషన్ పొడిగింపు



హైదరాబాద్, డిసెంబర్22 (నమస్తే తెలంగాణ): సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీగా అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్న ఫైనాన్స్ డైరెక్టర్ బలరాం నాయక్ డిప్యూటేషన్‌ను మరో ఏడాది పాటు పొడిగించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఆయననే పూర్తిస్థాయి సీఎండీగా నియమించే అవకాశం కూడా ఉన్నట్టు తెలుస్తున్నది.

## ప్రయాణికుల ఫిర్యాదులపై దృష్టి

### భద్రతా అంశాలపై రైల్వే అధికారుల సమీక్ష

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ప్రయాణికులు చేసే ఫిర్యాదుల పరిష్కారంపై రైల్వే అధికారులు దృష్టి సారించారు. రైళ్లలో ఏర్పాటు చేసిన కనీస సౌకర్యాలు, భద్రత వంటి పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) సమన్వయంతో నేరాలను తగ్గించే వ్యూహాలు, మెరుగైన రైల్వే భద్రత కోసం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ జోనల్ మేనేజర్లతో చర్చించారు. రానున్న రోజుల్లో రైల్వే భద్రత అంశాలపై కీలకంగా వ్యవహరించాలని ఆర్‌పీఎఫ్ అధికారులకు మంత్రి సూచించారు. ఈ మేరకు జీఆర్‌పీ ఉన్నతాధికారుల 5వ అఖిల భారత సమావేశంలో ఈ అంశాలపైనా చర్చించినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

# సిరులవేణి.. సింగరేణి!

- 104 ఏండ్ల సుధీర్ఘ ప్రస్థానం
- నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం
- సంస్థను వెంటాడుతున్న సమస్యల సవాళ్లు



హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బొగ్గు పేరెత్తగానే సింగరేణియే గుర్తుకొస్తుంది. నల్లబంగారానికి సింగరేణి పర్యాయపదమైంది. అంతలా ప్రసిద్ధి పొందిన సింగరేణి.. ఆవిర్భవించి నేటికి 104 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం సింగరేణి వ్యాప్తంగా ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. కొత్తగూడెంలో నిర్వహించనున్న వేడుకల్లో సంస్థ సీఎండీ బలరాం పాల్గొననున్నారు. బొగ్గు వెలికితీతే ప్రధాన బాధ్యతగా ఆవిర్భవించిన సింగరేణి వ్యాపార విస్తరణ, తదితర అనేక రంగాల్లోనూ పయనిస్తున్నది. కొత్త గనులనూ చేపట్టనున్నది. ఒడిశా నైనీ కోల్‌బ్లాక్, కొత్తగూడెంలో వీకే ఓసీ, ఇల్లందులో రొంపేడు ఓసీ, గోలేటి ఓసీల్లో ఉత్పత్తిని ప్రారంభించనున్నది. కొత్తగూడెంలో వెంకటేశ్ ఖని, ఇల్లందులో జవహర్‌ఖని గనులకు అనుమతులు పొందింది. రామగుండంలో 500 మోగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్‌ను నెలకొల్పనున్నది. ఇటీవలే కార్బన్‌డయాక్సైడ్ నుంచి మిథనాల్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణానికి సంకల్పించింది.

### ఇతర ఖనిజ తవ్వకాలపైనా గురి

లిథియం సహా ఇతర ఖనిజాల తవ్వకాలపైనా సింగరేణి దృష్టిపెట్టింది. జియోథర్మల్, గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియం నైట్రేట్ తయారీకి చర్యలు చేపట్టింది. టీజీ జెన్‌కోతో కలిసి రామగుండంలో కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్‌ను నిర్మించనున్నది. రాజస్థాన్‌లో సోలార్ ప్లాంట్‌ను నిర్మించనుంది. ఇంతటి ఘనకీర్తిని కలిగిన సింగరేణిని పలు సమస్యలు వెన్నాడుతున్నాయి.

### సమస్యలు.. సవాళ్లు!

- సింగరేణిలో మొత్తం 40 గనులుంటే 22 భూగర్భ గణులే. వీటిలో ఉత్పాదక వ్యయం అధికం కావడంతో ఏటా రూ.3 వేలకోట్లు నష్టాలొస్తున్నాయి.
- కొత్తగా ఉత్పత్తి ప్రారంభించాల్సిన గనులకు కేంద్ర అటవీ మంత్రిత్వశాఖ నుంచి సకాలంలో అనుమతులు రావడం లేదు. ఈ కారణంతోనే నైనీ కోల్‌బ్లాక్ నాలుగేండ్లుగా ముందుకుసాగడం లేదు.
- ఉత్పత్తి నిరుడు 72 మిలియన్ టన్నులు ఉండగా, ఈ ఏడాది 74 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకున్నది. ఆర్థిక సంవత్సరానికి ఇంకా 100 రోజులే గడువు ఉండగా, రోజుకు 2.7 లక్షల టన్నుల బొగ్గును వెలికితీస్తేనే లక్ష్యం పూర్తవుతుంది.
- కార్మికుల గైర్హాజరు, పనిగంటలు సైతం బొగ్గు ఉత్పత్తి, సంస్థ ఆర్థిక పరిస్థితులపై ప్రభావం చూపుతున్నాయి. 2024 జనవరి నుంచి అక్టోబర్ వరకు 300 రోజుల్లో 75 రోజులు కూడా పనిచేయని కార్మికుల సంఖ్య 1,892గా తేలింది. పలువురు కార్మిక సంఘాల నేతలు డుమ్మాలు కొడుతున్నారు.
- యంత్రాల వినియోగంలోనూ చెప్పుకోదగిన పురోగతి లేదు. యంత్రాలను 18 గంటలు నడపాలని సంస్థ వర్గాలు పదే పదే ఆదేశాలిస్తున్నాయి.
- బొగ్గు గనుల్లో ప్రమాదాలు, కార్మికుల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఏటా పదుల సంఖ్యలో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు.
- కారుణ్య నియామకాల్లో అక్రమాలు సంస్థకు మాయనిమచ్చను తెచ్చిపెట్టాయి. ఈ అక్రమాలపై సీఐడీ విచారణ జరిపింది.
- వర్షాలు, వరదలు సైతం బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయి. భారీ వర్షాలతో ఓపెన్‌కాస్టుల్లో నీరు చేరుతున్నది. ఈ నీటి తొలగింపు పెద్ద సమస్యగా మారుతున్నది.



మిర్చి, వివిధ పూల, కూరగాయల చీడపీడల నివారణకు పిచికారీ చేస్తున్న పురుగు మందులు

## ఉద్యాన పంటల్లో

# సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- వాతావరణ మార్పుల నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరి
- శాస్త్రవేత్తల సూచన

**ప్రస్తుతం తెలంగాణ** రాష్ట్రవ్యాప్తంగా ఫెంగల్ తుఫాన్ కారణంగా వాతావరణ పరిస్థితులు మారుతున్నాయి. అందుకు అనుగుణంగా రైతులు ఆయా పంటల రక్షణకు తగు జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని పూలు, కూరగాయల విభాగం శాస్త్రవేత్తలు సూచించారు.

–వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 22



### బంతిలో..

రబీలో నాటిన పంటకు 30 రోజులకు తలను తుంచి వేయాలి. ఆకుల తినే పురుగుల నివారణకు క్లోరోపైరీపాస్ 2 మి.లీ, లీటర్ నీటిని కలిపి పిచికారీ చేయాలి.

కాయతొలుచు పురుగు నివారణకు నొవాల్యూరాన్ 0.75 ఎంఎల్, లీటర్ నీటిని కలిపి పిచికారీ చేయాలి. బ్యాక్టీరియా ఆకు మచ్చ తెగుళ్లు, కొనోఫోరా ఎండుతెగుళ్లు నివారణకు కాఫర్ ఆక్సీక్లోరైడ్0. 3గ్రాలు, ప్లాంటమైసిన్ గ్రాము, తగు మోతాదు నీటిని పిచికారీ చేయాలి. కాయ కుళ్లు, పక్షి కన్ను తెగుళ్ల నివారణకు ప్రొఫికొనైజోల్ 1 మి.లీ లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పూలల్లో అకాలవర్షాల నుంచి ఉద్యాన పంటల రక్షణకు చేపట్టాల్సిన ఆకస్మిక జాగ్రత్తలు తీసుకోవాలి.



### చామంతి..

పూత దశలో ఉన్నది. అధికంగా ఉన్న పక్క కొమ్మలను మొగ్గలను తుంచివేయాలి. పక్కన వచ్చిన పిలకలను తీసివేయాలి. బూడిద తెగుళ్లు కనిపిస్తే నీటిలో కరిగే గంధకం 2.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పువ్వు కుళ్లు నివారణకు కార్బండైజిమ్, గ్రాము లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



### మల్లె..

మొక్కల్లో కొమ్మ కత్తిరింపులు, ఎరువులను ఒక నెలవరకు వేయకూడదు. కొత్త ఇగుర్లు ప్రారంభమైన తర్వాత నీటి తడులను ఇవ్వాలి. ఆకుమచ్చ, బూడిద, బూజు తెగుళ్ల నివారణకు కార్బండైజియం, మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**- డాక్టర్ గద్దె జ్యోతి, సైంటిస్ట్, హెడ్ పూల పరిశోధనా విభాగం, రాజేంద్రనగర్**



### గులాబీ..

కొమ్మ కత్తిరింపులు చేపట్టాలి. ఆకులు తినే మిడతల నివారణకు వేప కషాయం 5 ఎం.ఎల్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. పొగాకు లద్దె పురుగు నివారణకు స్పైనోసాడ్ 0.3 మిల్లీలీటర్‌కు నీటిని కలిపి పిచికారీ చేయాలి. బూడిద తెగుళ్ల నివారణకు హెక్సాకొనజోల్ 2 మిల్లీ లీటర్ లేదా నీటిలో కరిగే గంధకం 2.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పూలను ఉదయం, సాయంత్రం వేళలో మాత్రమే తెంచాలి.



పూల కత్తిరింపుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జ్యోతి

కూరగాయల్లో .. టమాట, వంకాయ, ఉల్లి, బెండ, తీగజాతి కూరగాయల్లో పొలంలో నిలిచిన నీటిని తీసివేయాలి. పంట మీద 13, లీటర్ నీటిచొప్పున కలిపి పిచికారీ చేయాలి. మొక్కలకు మట్టిని ఎగదొయ్యాలి. నిటారుగా పెరిగే మొక్కలకు ఊతమివ్వాలి. 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు యూరియా ద్రావణం పిచికారీ చేయాలి. చనిపోయిన మొక్కలను తీసివేసి, ఆ ప్రదేశంలో మళ్లీ విత్తుట, నారు నాటుట చేపట్టాలి. కలుపు నివారణకు అంతర కృషిచర్యలు చేపట్టాలి. 19.19.19 తగు మోతాదు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మిరపలో 10 గ్రాముల యూరియా, చక్కెర, లీటర్ నీటిని కలిపి పిచికారీ చేయాలి. మొక్కలు ఎక్కువ కాలం నీటిలో మునిగినట్లైతే మెగ్నీషియం సల్ఫేట్ 5 గ్రాములు నీటిలో చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ఇనుము ధాతులోపం కనిపిస్తే 50 గ్రాముల అన్నభేది, 10 గ్రాముల నిమ్మ ఉప్పు 10 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలి.

**- డా. అనిత కూరగాయల విభాగం హెడ్, రాజేంద్రనగర్.**

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

### ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ కిరణ్మయి



విద్యార్థులతో మాట్లాడుతు్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

పెద్దకొడప్‌గల్, డిసెంబర్ 22 : పెద్ద కొడప్‌గల్ ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఆదివారం రాత్రి బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో గురువారం ఉడికీ ఉడకని అన్నం తినడంతో నలుగురు విద్యార్థులు తీవ్ర కడుపునొప్పితో బాధపడగా ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించిన ఘటనపై ఆరా తీశారు. వంటలు, విద్యార్థుల గదులు, స్నానపు గదులు పరిశీలించారు. వసతిగృహంలో ఉన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో చికిత్స పొందిన విద్యార్థుల ఆరోగ్యం గురించి వార్డెన్ రాజేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మంచి చదువు అందించాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చేలా ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. నాణ్యమైన సరుకులు, తాజా కూరగాయలు మాత్రమే వాడాలన్నారు. వంట నిర్వాహకులు పరిశుభ్రత పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.



పెద్దకొడప్‌గల్ ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థులతో భోజనం చేస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

## బల్దియాలో జరుగుతున్న అవినీతిపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారెడ్డి

కామారెడ్డి, డిసెంబర్ 22 : కామారెడ్డి బల్దియాలో జరుగుతున్న అవినీతిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు వీఎల్ నరసింహారెడ్డి అన్నారు. కామారెడ్డిలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భార్యలు కౌన్సిలర్లుగా కొనసాగుతుండగా.. భర్తల పెత్తనం కొనసాగుతున్నదని అన్నారు. బల్దియా విషయాలపై కలెక్టర్ దృష్టి సారించి, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, నాయకులు దేవయ్య, ఈశ్వర్, మల్లేశ్, సాయిలు, రాజమణి, పుష్పలత, శ్యామల, నజీర్ పాల్గొన్నారు.

## మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ





జావిద్‌ను సన్మానిస్తున్న అతిథులు

బాన్సువాడ, డిసెంబర్ 22 : రాష్ట్రస్థాయిలో నిర్వహించిన మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని బోర్లం జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన జావిద్(పదో తరగతి) ప్రతిభ చూపాడు. రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచాడు. దీంతో విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయుల బృందం ఆదివారం అభినందించింది. విద్యార్థికి మెళకువలు అందించిన గణిత ఉపాధ్యాయుడు పద్మ శ్రీనివాస్ కృషిని కొనియాడారు.